భవనం పూర్తయ్యేదెన్నడో?

- అసంపూర్తిగా పోచారం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేదలు
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం



పోచారంలో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రం భవనం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. అధికారుల అలసత్వం కారణంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. ట్రీట్‌మెంట్ కోసం 20 నుంచి 25 కిలోమీటర్ల దూరం పోవాల్సిన పరిస్థితి పోచారం గ్రామంలో నెలకొంది. పోచారంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభమై మూడు సంవత్సరాలవుతున్నా ఇప్పటికీ అసంపూర్తిగానే ఉంది. అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు కేటాయించి అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులు పూర్తి చేయించి వైద్యం అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట: పొందూర్తిలో కుమ్మరి సంఘం భవనానికి ప్రహరీ నిర్మాణం కోసం సోమవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు కుమ్మరి సంఘం ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు సావుసాని సంపత్ రెడ్డి, పొందుర్తి గ్రామ అధ్యక్షుడు రమేష్, బూత్ అధ్యక్షులు రాజు పాల్గొన్నారు

ప్రతి హామీని ఎమ్మెల్యే నెరవేరుస్తున్నారు

భిక్కనూరు: గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నెరవేరుస్తున్నారని బీజేపీ భిక్కనూరు మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం జంగంపల్లిలో గంగపుత్ర సంఘం భవన నిర్మాణ పనులకు సంబంధించిన పూజ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి తిరుమలేష్, గ్రామశాఖ అధ్యక్షుడు కుమ్మరి నరేందర్, నేతలు ప్రవీణ్‌చారీ, చంద్రం,రాము, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియం వైపు అన్నదాత చూపు



లారీలో నింపుతున్న సేంద్రియ ఎరువు

బిచ్కుంద(జుక్కల్): ప్రతి ఏడాది ఖరీఫ్, రబీలో పంటల మార్పిడి, సేంద్రియ ఎరువులు వాడకంతో భూమి సారవంతమై దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ అధికారులు రైతులకు సూచనలు చేస్తుండడంతో రైతులు సేంద్రియ ఎరువుల వైపు దృష్టి సారిస్తున్నారు. వచ్చే ఖరీఫ్‌లో పంటల సాగులో పెట్టుబడులను తగ్గించుకోవడానికి ప్రత్యామ్నాయాల వైపు దృష్టి సారిస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో ఎదురవుతున్న దుష్పరిణామాలు, సాగులో పెట్టుబడులు తగ్గించుకునేందుకు రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై శ్రద్ధ చూపుతున్నారు. పెరిగిన ఎరువుల ధరలతో ప్రస్తుతం పెట్టుబడులు రెట్టింపయ్యాయి. అదనపు భారంతో పాటు దిగుబడి తగ్గుతోంది. దీంతో రైతులు రసాయన ఎరువులకు స్వస్తి పలుకుతున్నారు. గొర్రెలు, మేకల ఎరువులను, పశువుల పేడను కొనుగోలు చేసి లారీలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై ఎరువులను తరలించి పంట చేలలో వేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఎరువు రూ.2 వేల నుంచి మూడు వేలకు లభిస్తోంది. ఒక్క లారీ ఎరువు రూ.20వేల నుంచి 25 వేలకు రైతులు కొనుగోలు చేస్తున్నారు. పొలాల్లో రైతులు భూసారాన్ని పెంచుకునేందుకు చెరువు మట్టిని కూడా పోయించుకుంటున్నారు.

సీపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు



భిక్కనూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



లింగాపూర్‌లో..

భిక్కనూరు: ప్రభుత్వం ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు అందజేస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం భిక్కనూరు బాలికల ఉన్నత పాఠశాలలో సీపీఎస్ వద్దు... ఓపీఎస్ ముద్దు అంటూ మార్చి 2న హైదరాబాద్‌లో ధర్నా చౌక్ వద్ద నిర్వహించబోయే యుద్ధభేరి కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న యూపీఎస్ విధానాన్ని ఉద్యోగులందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. యుద్ధభేరి కార్యక్రమానికి ఉద్యోగులందరూ తరలిరావాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో..

కామారెడ్డి టౌన్: మార్చి 2న హైదరాబాద్ ధర్నా చౌక్‌లో జరిగే యుద్ధభేరి కార్యక్రమ వాల్ పోస్టర్లను సోమవారం జిల్లా కేంద్రంలోని లింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్‌సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల భాస్కర్ రెడ్డి, ఉద్యోగులు మోహన్, సునీల్, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకోవాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం కానిస్టేబుల్ శ్రీనివాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి శ్రద్ధగా చదువుకోవాలని షీటీం కానిస్టేబుల్ శ్రీనివాస్ సూచించారు. బొల్లారం హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. క్రమశిక్షణ లోపిస్తే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని చెప్పారు. సైబర్‌నేరాలపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయనవెంట పీఈటీ సుకుమార్‌గౌడ్ ఉన్నారు.

బెల్ట్‌షాపుపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

రాజంపేట: సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'జోరుగా బెల్ట్ షాపుల నిర్వహణ' వార్తా కథనానికి ఎక్సైజ్ శాఖాధికారులు స్పందించారు. సోమవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారం గ్రామాలలోని బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. గుండారంలోని ఓ బెల్ట్ షాపులో 20 మద్యం బాటిళ్లు, 6 బీర్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మధుసూదన్ రావు తెలిపారు. సిబ్బంది జీవన్, శరత్ పాల్గొన్నారు.

మిర్జాపూర్‌లో ఎండిన పంటల పరిశీలన



బాన్సువాడ: నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్ శివారులో ఎండిన పంటలను సోమవారం జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) తిరుమల ప్రసాద్ పరిశీలించారు. ఈ నెల 9న సాక్షి దినపత్రికలో 'నెర్రలు బారుతున్న ఆశలు' అనే వార్తా కథనం ప్రచురితమైంది. నిజాంసాగర్ ఉప కాలువల చివరి ఆయకట్టుకు నీరందక పంటలు ఎండుతుండడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వ్యవసాయాధికారులు ఎండుతున్న పంటలను పరిశీలించారు. ప్రతి గుంటకు సాగునీరందించి వరి పంటలను ఎండనివ్వకుండా చూస్తామని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. ఏడీఏ అరుణ, ఏవో భవాని, ఏఈవో గోపాల్, సాయి సుమన్ తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన



బాన్సువాడ రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డితో కలిసి మండల ఓటరు జాబితాను విడుదల చేశారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ పరిధిలోని ఓటరు వివరాలతో కూడిన జాబితాలను ప్రదర్శించారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు



పిట్లం(జుక్కల్): చిల్లర్గి గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల సిబ్బంది సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిచారు. ఈ సందర్భంగా దివ్యాంగులు పిల్లలకు ఆట పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, దివ్యాంగుల పిల్లలకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు.

కామారెడ్డి నుంచి లింగంపేటకు పాఠశాలను మార్చండి



వినతిపత్రం అందజేస్తున్న లింగంపేట మండల వాసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రానికి కేటాయించిన ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను కామారెడ్డిలోని దేవునిపల్లి నుంచి లింగంపేటకు మార్చాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు లింగంపేట మండలానికి చెందిన అంబేడ్కర్ సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కొంత కాలంగా లింగంపేట మండల కేంద్రంలో వసతులు లేవని కామారెడ్డిలోని దేవునిపల్లికి మార్చారు. ప్రస్తుతం మండల కేంద్రంలో అన్ని వసతులతో కూడిన భవనాలు ఉన్నందున లింగంపేటకు మార్చాలని కోరారు. ఇందుకోసం కృషి చేయాలని చైర్మన్‌ను కోరారు. సమాచార హక్కు పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి లెగ్గల రాజు, మండల అంబేడ్కర్ సంఘం ఉపాధ్యక్షుడు భూపతి, ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు నెల్లూరి గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



నిజాంసాగర్(జుక్కల్): గ్రామ పంచాయతీల్లో జరుగనున్న ఎన్నికలకు కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని నిజాంసాగర్ ఎంపీడీవో గంగాధర్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీల వారీగా వార్డులు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

మజీదుల వద్ద ఏర్పాట్లు చేయాలని వినతి



కామారెడ్డి టౌన్: ఈనెల 13న సబా–ఇ–బారాత్(జగ్నీకి రాత్) పండగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అన్ని మజీదుల వద్ద విద్యుత్ దీపాలు, తాగునీరు ఇతర ఏర్పాట్లను చేయాలని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఇసాక్ శేరు సోమవారం కమిషనర్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం ద్వారా కోరారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో మజీదులలో ప్రార్థనలకు హాజరవుతారని వివరించారు. నాయకులు శ్రీనివాస్ తదితరులున్నారు.

గ్రామ సంఘాల అంతర్గత ఆడిట్ నిర్వహణ



నాగిరెడ్డిపేటలో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు



బాన్సువాడలో పనులు పరిశీలిస్తున్న సిబ్బంది

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామ సంఘాలకు సంబంధించి సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో అంతర్గత ఆడిట్ నిర్వహించారు. గత సోమవారం 2 గ్రామ సంఘాలకు సంబంధించిన ఆడిట్ నిర్వహించగా ఈ సోమవారం మిగతా 12 గ్రామ సంఘాలకు సంబంధించిన ఆడిట్‌ను నిర్వహించారని ఏపీఎం జగదీశ్‌కుమార్ తెలిపారు. ఆడిట్ నిర్వహణలో సీబీవో ఆడిటర్ వడ్ల కుమార్, అకౌంటెంట్ రాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా సామాజిక తనిఖీ

బాన్సువాడ రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ చేపడుతున్నారు. డీఆర్పీలు క్షేత్రస్థాయిలో పర్యటించి చెల్లించిన బిల్లులకు సరిపడా పని జరిగిందా లేదా అని ఆరా తీస్తున్నారు. కూలీల చెల్లింపులపై వారితో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నారు. ఈనెల 13న మండల కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించనున్నారు. కాగా ఉపాధిహామీ పథకం పనులపై కొనసాగుతున్న సామాజిక తనిఖీని అధికారులు గుట్టుచప్పుడు కాకుండా చేపడుతుండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల సమాఖ్య లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సెర్ప్ డీపీఎం సుధాకర్ సూచించారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏపీఎం జగదీశ్ ఉన్నారు.

ఆధ్యాత్మికం

మహాలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



కామారెడ్డి రూరల్: గాయత్రి, విద్యుత్‌నగర్ కాలనీలోని మహాలింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

తిమ్మారెడ్డిలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి గ్రామంలో సోమవారం గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, కుడుముల సత్యనారాయణ తదితరులున్నారు.

చాముండేశ్వరి హుండీ ఆదాయం రూ.74,458

దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరీ ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. మూడు నెలలకు సంబంధించి హుండీ ద్వారా రూ.74,458 వచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి తెలిపారు. ఆలయ ఈవో ప్రభు, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ దేవి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



సదాశివనగర్: యాచారంలో జగదాంబ దేవి , సేవాలాల్ మహారాజ్ ఆలయ 36వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జెడ్పీటీసీ కమిలి నర్సింలు, మాజీ సర్పంచ్ లతా రమేశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నాగాగౌడ్, మాజీ ఎంపీటీసీ రాంచందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

గౌరారం కలాన్ సాయిబాబా ఆలయంలో..

గాంధారి(ఎల్లారెడ్డి): గౌరారం కలాన్‌లో షిరిడీ సాయిబాబా ఆలయ వార్సికోత్సవాల్లో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సోమవారం పాల్గొని సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని బాబాను వేడుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గంగామాత వార్షికోత్సవాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పెద్ద చెరువు గంగమాత 23వ వార్షికోత్సవాలు ఈనెల 11, 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు పట్టణ గంగపుత్ర సంఘం, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో ప్రధానంగా 12న హోమం, 13న గురువారం ఉదయం 9గంటలకు భవానీరోడ్డు లోని పట్టణ గంగపుత్ర సంఘం నుంచి ఉత్సవ మూర్తులు, బోనాల ఊరేగింపు ఉంటుందని వివరించారు.

క్లుప్తంగా

సకాలంలో పన్నులు చెల్లిస్తేనే గ్రామాభివృద్ధి



బాన్సువాడ రూరల్: సకాలంలో ఇంటి, కుళాయి పన్నులు చెల్లిస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని బాన్సువాడ మండల పంచాయతీ అధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. తాడ్కోల్‌లో కొనసాగుతున్న పన్నుల వసూలును ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. గ్రామస్తులు పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు ప్రశాంతి, సృజన్‌రెడ్డి, కారోబార్ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

'బీసీ-సి, ఈ గ్రూప్‌ల 5 శాతం రిజర్వేషన్లు రద్దు చేయాలి'

కామారెడ్డి అర్బన్: కులగణనలో మత మార్పిడి అయిన క్రిస్టియన్లు, ముస్లింలు లేనట్టు ప్రభుత్వం ప్రకటించినందున బీసీ–సి, బీసీ–ఈ రిజరేషన్లు రద్దు చేయాలని బీసీ సంఘాల ఐక్యకార్యచరణ సమితి జిల్లా కన్వీనర్ డి.విఠల్ ముదిరాజ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ–సికి ఉన్న 1 శాతం, ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేసి మిగతా బీసీ కులాలకు అందజేయాలని విఠల్ ముదిరాజ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎం, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి లేఖలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, బహుజన మేధావులు సమగ్రంగా చర్చించాలన్నారు.

యాప్‌లో నమోదుపై శిక్షణ



ఎల్లారెడ్డిరూరల్: మండల సమాఖ్యలో చేసిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి లోన్ యాప్‌లో నమోదుపై అకౌంటెంట్లకు డీపీఎం సుధాకర్ సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీపీఎం, లోన్‌యాప్‌లో నమోదు చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. ఏపీఎం ప్రసన్నరాణి తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం



మాచారెడ్డి: పాల్వంచ మండలం, ఇసాయిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శివ రామాలయానికి మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్ రావు సోమవారం రూ.3 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో మాజీ వైస్ ఎంపీపీ జీడిపల్లి నర్సింహారెడ్డి ఆలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మద్దెల రాజు, కొత్త అరవింద్, నారాయణ, రంజిత్ కుమార్, నవీన్ రెడ్డి, పాలమాకుల సాయికుమార్ గౌడ్, ఎల్లంపేట రాజు, కసాల సన్నీగౌడ్ ఉన్నారు.

ప్రాక్టికల్ పరీక్షల పరిశీలన



మాచారెడ్డి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాగుతున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను సోమవారం జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట అధ్యాపకులు నర్సింలు, శ్రీనివాస్, సుదర్శన్ ఉన్నారు.

మోడల్ హౌస్ పనులను త్వరగా ప్రారంభించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించాల్సిన ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని హౌసింగ్ డీఈఈ సుభాష్ సూచించారు. నిర్మాణం చేపట్టాల్సిన స్థలాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. పనులు ఇంకా ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను ఎంపీడీవో ప్రభాకరచారిని అడిగి తెలుసుకున్నారు. మోడల్‌హౌస్ నిర్మించే ప్రాంతంలో ఉన్న రెండు టేకు చెట్ల తొలగింపునకు అటవీశాఖ అధికారుల నుంచి అనుమతులు రాకపోవడం వల్ల పనులు ప్రారంభించలేదని ఎంపీడీవో ప్రభాకరచారి డీఈఈతో పేర్కొన్నారు. ఆయనవెంట హౌసింగ్ ఏఈ అశోక్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మైనార్టీ మండలాధ్యక్షుడు ఇమామ్ ఉన్నారు.

సంక్షిప్తం

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు సబ్ సెంటర్లలో గర్భిణులకు డాక్టర్ శరత్ సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతి నెలా వైద్య పరీక్షలు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని వైద్యులు సూచించారు.

వసతి గృహంలో విద్యార్థులకు..



మాచారెడ్డి: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో సోమవారం వైద్యాధికారి ఆదర్శ్, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 43 మందిని పరీక్షించిన వైద్యులు 22 మందికి వివిధ రకాల జబ్బులను గుర్తించి చికిత్స చేశారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు, ఏఎన్‌ఎంలు జయలక్ష్మి, లావణ్య, రజిత, ఆశావర్కర్లు ఉన్నారు.

మల్కాపూర్‌లో..

బీబీపేట: మల్కాపూర్‌లో మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 200 మందికి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ తన్మయ్ పాల్గొన్నారు.


తిమ్మోజీవాడిలో పశువైద్య శిబిరం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తిమ్మోజీవాడిలో పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాంప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఎల్‌డీఏ సూపర్‌వైజర్ కృష్ణ, విజయ పాల డైరీ అధ్యక్షుడు గంగాధర్ రావు, పశుగణ సహాయకురాలు అహల్య, జుగల్ కిషోర్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

జీవవైవిధ్యంపై అవగాహన సదస్సు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం జీవ వైవిధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి డైరీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేందర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన



కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాల, కాంప్లెక్స్ పరిధిలోని ఎంపీపీఎస్(సరంపల్లి), ఎంపీపీఎస్(బీసీ చిన్నమల్లారెడ్డి), ఎంపీపీఎస్(తిమ్మక్‌పల్లి), ఎంపీపీఎస్(లింగాయిపల్లి), ఎంపీపీఎస్(నర్సన్నపల్లి)లను సోమవారం ఎంఈవో ఎల్లయ్య సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల అభ్యసన శక్తి సామర్థ్యాలను పరిశీలించారు. భవిష్యత్తులో ఇంకా మంచి చదువులను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.